సీడ్ ఎంపిక చాలా కీలకం

- రొయ్యల పెంపకానికి సన్నద్ధం
- చెరువుల తయారీలో రైతులు బిజీబిజీ
- 1,970 ఎకరాల్లో పెంపకం



ఆరోగ్యకరమైన రొయ్యల సీడ్ (పిల్లలు)



చెరువులో విడుదల చేస్తున్న సీడ్

ముత్తుకూరు : వెనామీ రొయ్యల ఎదుగుదలకు సీడ్ (విత్తనం–పిల్లలు) ఎంపిక చాలా కీలకం. సీడ్ ఆరోగ్యకరంగా ఉంటే 50 శాతం పెంపకం విజయవంతమవుతుంది. అయితే సీడ్ ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ముత్తుకూరులోని మత్స్య కళాశాల శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. మండలంలో సుమారు 1,970 ఎకరాల్లో వెనామీ రొయ్యల పెంపకం జరుగుతోందని అంచనా. త్వరలో ప్రారంభమయ్యే పెంపకానికి రైతులు చెరువుల తయారీలో నిమగ్నమయ్యారు. అయితే సీడ్ ఎంపికకు సంబంధించి శాస్త్రవేత్తలు తగిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.

రొయ్యల రంగు పరీక్షించాలి



రైతులు ముఖ్యంగా రొయ్య పిల్లల రంగును పరీక్షించాలి. వాటి శరీరం లేత గోధుమ రంగులో గానీ, మట్టి రంగులో కొంచెం నలుపు రంగులో గానీ ఉండాలి. శరీరంతో పాటు ఈదే కాళ్ల దగ్గర ఎరుపు లేక నారింజ రంగు ఉంటే అవి ఒత్తిడికి లోనై ఉంటాయని అర్థం చేసుకోవాలి.

– డాక్టర్ ఆనంద్ ప్రసాద్ పాటూరి, సహాయ ఆచార్యుడు, ఆక్వా కల్చర్ విభాగం, మత్స్యకళాశాల

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి ఉన్న హేచరీల్లో సీడ్ ఎంపిక చేసుకోవాలి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బ్రూడ్ మల్టిప్లికేషన్ సెంటర్‌లో పెంచి హేచరీలకు ఉపయోగిస్తే ఆ సీడ్ ఆరోగ్యకరంగా ఉంటుంది.
- కొన్ని హేచరీల్లో వారి చెరువుల్లో పెరిగిన తల్లిరొయ్యల(బ్రూడర్స్) నుంచి ఉత్పత్తి అయ్యే పిల్లలను అమ్మకాలు చేస్తారు. వీటిల్లో రోగ నిరోధక శక్తి, ఎదుగుదల తక్కువగా ఉంటుంది. వివిధ రకాల ఒత్తిడికి గురయ్యే ఈ తల్లిరొయ్యలకు రోగాలను తట్టుకునే శక్తి ఉండదు.
- తల్లి రొయ్యల్లోని జబ్బులు బయటపడకుండా యాంటీబయాటిక్స్ ఇచ్చి సర్దుబాటు చేస్తారు. దీనివల్ల వీటి నుంచి ఉత్పత్తి అయ్యే పిల్లలు ఆరోగ్యకరంగా ఉండవు. పీసీఆర్ పరీక్ష చేస్తేనే జబ్బులు బయటపడుతాయి. ఈ అంశాన్ని రైతులు గమనించాలి.
- రొయ్య పిల్లలకు ఫార్మలిన్ పరీక్ష చేయించాలి. అలాగే, రొయ్య పిల్లలు ఏ సెలినిటీ(లవణ శాతం)లో ఉందో గమనించి అంతకంటే 20 శాతం ఎక్కువ సెలినిటీలో ఉంచి పరీక్షించాలి. ఈ దశలో తట్టుకొనే పిల్లలు నాణ్యమైనవని గుర్తించాలి.
- రొయ్య పిల్లల గట్(ప్రేగు) పూర్తిగా ఆహారంతో నిండి ఉండాలి. లేకుంటే అవి అనారోగ్యంతో ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

క్లుప్తంగా

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు గ్రామదేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ గావించారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.

వరిలో అధిక యూరియా వాడొద్దు

• ఏఓ వాసు



పొదలకూరు : వరి సాగు చేసే రైతులు యూరియాను అధికంగా వాడడం వల్ల అనర్థాలు ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ రబీకి సంబంధించి మండలంలో 14 వేల ఎకరాల్లో వరినాట్లు పడినట్టు పేర్కొన్నారు. ముందుగా నాటుపడిన వరి.. ప్రస్తుతం పొట్ట దశలో ఉందని, రైతులు నత్రజని అవసరం కోసం యూరియాను వాడుతున్నట్టు వెల్లడించారు. యూరియాను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వాడాల్సిందిగా పేర్కొన్నారు. మోతాదుకు మించి యూరియా వాడితే చీడపీడలతో పాటు పంట కోతదశలో వాలిపోతుందన్నారు. పంట కాలం పెరగడంతో పాటు, మిల్లింగ్‌లో విరుగుడు వస్తుందని సూచించారు. రైతులు నాటు సమయంలో ఒక పర్యాయం, 15 రోజుల తర్వాత మరో పర్యాయం వాడాలన్నారు. 45 రోజులకు ఆఖరి పర్యాయం పొటాష్‌తో యూరియా కలిపి నీటిని పలుచగా ఉంచి చల్లుకోవాలన్నారు. నీటిని బయటకు పంపి యూరియా చల్లుకుంటే మొక్కకు నత్రజని బాగా పడుతుందని పేర్కొన్నారు. 15 రోజుల వరకు మొక్కలు, ఆకులు పచ్చగా ఉంటాయన్నారు. జింక్‌సల్ఫేట్ నాటిన 15 రోజులకొక పర్యాయం, 30 రోజులకొక పర్యాయం ఎకరాకు 200 గ్రాములు పిచికారీ చేసుకుంటే వేసిన ఎరువులు మొక్కకు అందుతాయని, తద్వారా పైరు ఆరోగ్యంగా పెరుగుతుందని సూచించారు.

హైందవ శంఖారావానికి తరలిన ప్రజలు



మనుబోలు : సనాతన ధర్మ పరిరక్షణ కోసం విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం సభకు మనుబోలు మండల కేంద్రం నుంచి గ్రామస్తులు ఆదివారం ఉదయం బయలుదేరారు. సమరత సేవా సమితి మండల కన్వీనర్ ఆలూరు రాము, యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పురుషులతో పాటు పలువురు మహిళలు కూడా సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆలూరు రాము మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా హిందూవులు ధర్మ పరిరక్షణ కోసం కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

10న కోనలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బంగారు రంగులతో కూడిన ఏడు ద్వారాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఉదయం 3 గంటలకు అభిషేకం, 5 గంటలకు పూలంగి సేవ, ఉత్తర ద్వార దర్శనం, ఉదయం 8 గంటలకు గోనుపల్లిలో గరుడ సేవ, గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు పూజల్లోని పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోవిందనామస్మరణతో దేవస్థానం మార్మోగింది.

అభినందన



కొడవలూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన వీరి చలపతి రావును నార్తురాజుపాళెంలోని పార్టీ కార్యాలయంలో సౌత్ గండవరం సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

గొలగమూడిలో జోనల్ స్పోర్ట్స్ మీట్



పోటీలను ప్రారంభిస్తున్న బీసీ గురుకుల పాఠశాలల సెక్రటరీ కృష్ణమోహన్



హాజరైన విద్యార్థినులు

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి వద్ద నున్న జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి జోనల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ప్రారంభమైంది. బీసీ గురుకుల పాఠశాలల సెక్రటరీ కృష్ణమోహన్ హాజరై పోటీలను ఆరంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీలకు వివిధ బీసీ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థినులు పాల్గొంటారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటుగా, శారీరక ధృడత్వాన్ని పెంచుతాయని తెలియజేశారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా క్రీడల్లో ఆసక్తిగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పొదలకూరు : పట్టణంలోని పెన్షనర్ల సంఘం భవన్‌లో ఆ సంఘ కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.కోటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.నారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా షేక్.మస్తాన్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా యు.మస్తానయ్య, ఉపాధ్యక్షులుగా కేవీ కృష్ణయ్య, వీవీ రమణరావు, వి.శ్రీనివాసులు, ఎం.ఝాన్సీలక్ష్మీబాయ్, ఎ.పెంచలయ్య, సంయుక్త కార్యదర్శులుగా పి.హబీబ్‌ఖాన్, ఎన్వీ రమణారెడ్డి, పి.పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామాల్లో భగవద్గీత ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

ముత్తుకూరు : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, నెల్లూరు ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిపారు. మల్లూరు, రావిపాడు, దువ్వూరువారిపాళెం, చుట్టుగుంట, పచ్చికాయలమిట్ట, పోతునాయుడుదిబ్బ, దమ్మాయపాళెంలో ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సురమౌళి, ప్రదీప్, నిగమ, కొండమ్మ, రాజేంద్రప్రసాద్, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, రమాదేవి, రఘురామయ్య పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ప్రసన్నతో పార్టీ నేతలు



ప్రసన్నతో ఎంపీపీ జ్యోతి

కోవూరు : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పలువురు నేతలు నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో కోవూరు జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి తదితరులు ప్రసన్నను కలిసి పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట నాయకులు మందా రవి, కవరగిరి ప్రసాద్, అంజనరావు, రమేష్, చక్రి ఉన్నారు.

- కొడవలూరు మండలం కొత్తవంగల్లు వైఎస్సార్‌సీపీ నేతలు చక్కా మనోహర్‌బాబు, శూలం హరిబాబు, రమణయ్య, వంశీ, కుమార్‌లు ప్రసన్నను కలిసి పూలమొక్కను అందజేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు కొడవలూరు ఎంపీపీ జ్యోతి, గాలి సునీల్‌కుమార్‌లు కలిసి పూలమొక్కను అందజేశారు.

చిన్నారుల ఆచూకీ లభ్యం



చిన్నారులతో ఎస్సై నరేష్

విడవలూరు : మండలంలోని ఊటుకూరు గ్రామం ఇందిరానగర్‌లో తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ ఆదివారం లభ్యమైంది. ఎస్సై పి.నరేష్ కథనం మేరకు.. గత నెల 31వ తేదీ రాత్రి బండి నెహమ్యా, దాసరి సుబ్రహ్మణ్యం అనే ఇద్దరు చిన్నారులు ఊటుకూరు గ్రామంలో కనపడకుండా పోయారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా కోట మండలం శ్రీనివాసనత్రంలో ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్కడ చిన్నారుల మేనత్త వద్ద ఉండడంతో పోలీసులు వారిని తీసుకెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు.

వాహనదారులకు ఏదీ రక్షణ?



రక్షణ గోడలు లేని పొట్టేళ్ల వాగు వంతెన

పొదలకూరు : పొదలకూరు–మనుబోలు రహదారిలో నిమ్మమార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న పొట్టేళ్ల వాగు వంతెనంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇటీవలి కాలంలో తరచూ వంతెనపై రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మార్గంలో మనుబోలు మండలం వీరంపల్లి, గొట్లపాళెంతో పాటు పొదలకూరు మండలంలోని బిరదవోలు ఆటోలు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. కాగా పొట్టేళ్లవాగు వంతెనకు రక్షణ గోడలు విరిగిపోవడంతో ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే వాహనాలు వాగులో పడిపోతున్నాయి. గతంలో రెండు ఆటోలు వెళ్తుండగా ఇసుకలారీ వేగంగా వెళ్లి ఢీకొనడంతో ఆటోలు వాగులో పడి అందులోని ప్రయాణికులు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. ఇలా తరచుగా వంతెనపై చిన్నచిన్న ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. వంతెన వస్తుందంటే ప్రయాణికులు అప్రమత్తం కావాల్సి వస్తోంది. వంతెనకు రక్షణ గోడలను నిర్మిస్తే కొంతవరకు ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అలాగే మండలంలోని ఇనుకుర్తి, అయ్యగారిపాళెం, నందివాయ గ్రామీణ రోడ్డు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

వేళాంగణి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు వేళాంగణి చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చి డైరెక్టర్, ఫాదర్ లూకాస్ రాజ్ మాట్లాడారు. వేళాంగణి మాతను సేవించి ఒక్క రాత్రి పుణ్యక్షేత్రంలో జాగరణ చేస్తే కష్టాలు తీరిపోతాయన్నారు. ఇందువల్లే రాష్ట్ర నలువైపుల నుంచి క్రైస్తవులతో పాటు ఇతర మతాలకు చెందిన వేలాది మంది అమ్మవారిని దర్శించుకుని ప్రార్థనలు చేస్తారన్నారు.

సీపీఎం సీనియర్ నేత సదయ్య మృతి



దేవారెడ్డి సదానందరెడ్డి(ఫైల్)



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : సీపీఎం సీనియర్ నేత దేవారెడ్డి సదానందరెడ్డి (సదయ్య–79) ఆదివారం ఉదయం ముత్తుకూరులో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సదయ్య తన స్వగృహంలో మృతిచెందారు. సీపీఎంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన ఎన్నో ఆందోళనలు, ధర్నాలు ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి మండల సీపీఎం కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆయన అంత్యక్రియలు సోమవారం ఉదయం జరుగుతాయని నాయకులు ప్రకటించారు.

కాకాణి పరామర్శ

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరుకు వచ్చి, సదానందరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి, అంజలి ఘటించారు. తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సదయ్య తనయులు అశోక్‌రెడ్డి, నాగార్జునరెడ్డి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా వార్షికోత్సవం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో ఉన్న జీవీకే చిన్మయ విద్యాలయంలో 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యాలయ కరెస్పాండెంట్ బద్దిపూడి హరిత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి ఎం.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. బాగా చదువుకుంటే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ బసవిరెడ్డి, ఆర్‌ఐఈ ప్రొఫెసర్ జి.విశ్వనాథప్ప, విద్యాలయ జోనల్ ఇన్‌చార్జి సువీరనంద, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌లో ఆదివారం సందర్శకులతో సందడి వాతావరణం కనిపించింది. పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బీచ్ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల తాకిడి సాయంత్రం వరకు కొనసాగింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు గంటల కొద్దీ తీరంలో గడిపారు.